క్లుప్తంగా

ఇంటర్ పరీక్షకు 29 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో బుధవారం ఇంటర్ ఫస్టియర్ బోటనీ, సివిక్స్ పరీక్షలు జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలలాకు చెందిన 678 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 649 మంది పరీక్ష రాశారని, 29 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

దంత వైద్య శిబిరం

రంగంపేట: దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ అన్నారు. వడిశలేరు గ్రామంలోని స్థానిక భజే నారాయణస్వామి ఆలయం వద్ద జీఎస్ఎల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని సంస్థ ఎండీ గన్ని భాస్కరరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 365 మందికి దంత పరీక్షలు చేసి, మందులు అందించారు. కొంతమందికి దంతాలను శుభ్రపరచి, సిమెంట్ పెట్టడం, దంతాలను తొలగించడం, కృత్రిమ దంతాలను అమర్చడం చేశారు. సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, జీఎస్ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, ఎస్ఎస్ పీఓ హరికృష్ణంరాజు పాల్గొన్నారు.

8 కిలోల గంజాయి స్వాధీనం

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం రేవు వద్ద 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, తమిళనాడుకు చెందిన పి.ముత్తును సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ బుధవారం అరెస్ట్ చేశారు. ఆ గ్రామంలో పడవల రేవు వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనుమానంగా సంచరిస్తుండగా ఎస్సై తన సిబ్బందితో ఆపి తనిఖీ చేశారు. అతని బ్యాగ్‌లో ఉన్న 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ చేయూత సమావేశాల షెడ్యూల్

బిక్కవోలు: మండలంలో వైఎస్సార్ చేయూత సమావేశాల షెడ్యూల్‌ను ఎంపీడీఓ విజయలక్ష్మి విడుదల చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ పథకం నాలుగో విడతను ప్రభుత్వం విడుదల చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా ఈ నెల 7న ఉదయం బిక్కవోలు, ఇలపల్లి, ఆర్ఎస్ పేట, మధ్యాహ్నం ఊలపల్లి, కొమరిపాలెం, కాపవరం గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే 8న మెళ్లూరు, ఆరికరేవుల, తొస్సిపూడి గ్రామాల్లో, 11న బలభద్రపురం, పందలపాక, కొంకుదురు, రంగాపురం గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు.

ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్యే



మల్లిడి కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న సత్తి వెంకటరామారెడ్డి తదితరులు

అనపర్తి: ప్రపంచాన్ని మార్చగలిగే శక్తిమంతమైన ఆయుధం విద్య ఒక్కటేనని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి ధర్మారెడ్డి అన్నారు. స్థానిక పాతవూరు బాపనమ్మ ఉపాలయం కర్రి అప్పారావు పార్క్ ప్రాంగణంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డిని సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ధర్మారెడ్డి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమన్నారు. రేడియో మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి.. చదువుపై ఉన్న జిజ్ఞాసతో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా కళాశాల ల్యాబ్ అసిస్టెంట్ నుంచి లెక్చరర్‌గా, అనంతరం గౌరవ డాక్టరేట్ పొందే వరకూ విశ్రమించలేదని ఆయన ప్రస్థానాన్ని వివరించారు. అదేవిధంగా ఆర్ఎంపీ వైద్యునిగా, ఫిజియోథెరపిస్ట్‌గా పలు రకాలుగా సమాజానికి కృష్ణారెడ్డి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డిని పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, వ్యాపారవేత్త మేడపాటి చెల్లారెడ్డి, కర్రి సూర్యప్రకాష్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు తేతలి దుర్గారెడ్డి, ఏజీపీ వెలగల లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సుదర్శన యాగం

మధురపూడి: లోక కల్యాణార్థం, ప్రజా సంక్షేమాన్ని కోరుతూ కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు చేపట్టిన శ్రీఅష్టముఖ గండభేరుండ లక్ష్మీనరసింహ సుదర్శన యాగం రెండో రోజైన బుధవారం కూడా కొనసాగింది. మూడు రోజుల పాటు జరిగే ఈ యాగంలో గురువారం పూర్ణాహుతి సమర్పిస్తారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

సీతానగరం: స్థానిక శివాలయంలో ఉమా రామలింగేశ్వర స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకుడు కూచిమంచి రాము ఆధ్వర్యంలో రామాచారి, సత్యవేణి దంపతులు, మాజేటి బాపిరాజు, పద్మ దంపతులు నిర్వహించారు.

గ్రామ స్వరాజ్యం జగన్‌తోనే సాకారం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఎస్టీ రాజాపురం, వడిశలేరుల్లో సచివాలయం, ఆర్బీకే, వెల్నెస్ సెంటర్ల భవనాల ప్రారంభం
- ఎస్టీ రాజాపురంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



ఎస్టీ రాజాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఎస్టీ రాజాపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సాకారం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎస్టీ రాజాపురం, వడిశలేరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను, పాఠశాల అదనపు భవనాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు అద్దాల పద్మ, కొల్లాటి శ్యామలావతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ప్రతి రెండు వేల జనాభా ఉన్న గ్రామానికి సచివాలయాన్ని ఏర్పాటు చేసి, గాంధీ ఆశయాలకు అనుగుణంగా, అవినీతి, అక్రమాలకు తావు లేకుండా స్వచ్ఛమైన పాలనను అందిస్తున్నారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు మళ్లీ మాయమాటలతో, అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అతని మాయమాటలు నమ్మవద్దని హితవు పలికారు. వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం అద్భుతమైన కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి నుంచి రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ఆర్‌బీకేలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లను ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య సాయానికి మండల కేంద్రాలకు, దూర ప్రాంతాలకు వెళ్లకుండా, గ్రామంలోనే సేవలందేలా చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అందరూ ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కష్ణంరాజు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎస్టీ రాజాపురం గ్రామంలో టీడీపీకి చెందిన గెడ్డం చిట్టిరాజు, కొలూరి నవీన్, పోసు భాను, ఎం.రాజారత్నం, పెనుగొండ వరప్రసాద్, అంజూరి సత్తిబాబు, తేలు వీరవెంకటరమణ, తేలు లోవరాజు, సూరిశెట్టి నాగేశ్వరరావు, పంపన లోవరాజు, వాసపల్లి ఆదినారాయణ, సూరిశెట్టి సాయి తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి, అర్హులకు అందించినట్టు చెప్పారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఎస్టీ రాజాపురంలో అర్హులైన 90 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వడిశలేరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వెంకటేష్, తహసీల్దార్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

అనపర్తి: జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం దుప్పలపూడి జగనన్న కాలనీలో రూ.1.05 కోట్ల వ్యయంతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్, కుళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామానికి చెందిన 121 మంది లబ్ధిదారులకు కొత్త ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. జగనన్న కాలనీలో వివిధ వీధులకు పెట్టిన పేర్లను ప్రముఖులు, వారి కుటుంబ సభ్యుల చేతులమీదుగా ఎమ్మెల్యే ఆవిష్కరింపజేశారు. సర్పంచ్ వల్లభశెట్టి శివపద్మిని, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లభశెట్టి సతీష్ పాల్గొన్నారు.

పొలమూరులో..

అనపర్తి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అక్కచెల్లెమ్మల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పొలమూరులో 376 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను బుధవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల కళ్లలో ఆనందం చూడాలన్నదే సీఎం జగనన్న ఆశయమన్నారు. ఇళ్ల స్థలాలు పంపిణీలో ఎన్ని అడ్డంకులెదురైనా, అధిగమించి కోట్ల రూపాయలు వెచ్చించి, అందజేస్తున్నట్టు వివరించారు. అవినీతి, వివక్షకు తావులేకుండా అర్హులందరికీ స్థలాలు అందజేస్తున్నట్టు చెప్పారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, మాజీ సర్పంచ్ మేడపాటి గంగిరెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ ప్రగతికి కృషి

కలెక్టర్ కె.మాధవీలత



బీఎంసీయూను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా గ్రామాల్లో బల్క్‌మిల్క్ చిల్లింగ్ యూనిట్ (బీఎంసీయూ)లను ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. భూపాలపట్నంలో 5 వేల లీటర్ల వరకూ పాలను శీతలీకరణ చేసే విధంగా ఏర్పాటు చేసిన బీఎంసీయూ, సంపత్‌నగరంలో పాల సేకరణ కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమూల్ సెంటర్ల ద్వారా మద్దతు ధరకు పాలను సేకరించి, పాడి కలిగిన రైతులకు ఆర్థిక ప్రయోజనం కలిగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పాల చిక్కదనం, వెన్న శాతం ఆధారంగా ధర చెల్లిస్తారన్నారు. ఇందుకుగాను జిల్లాలో ఇప్పటివరకూ 170 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రతి కుటుంబం ఆర్థికంగా బాగుపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో మహిళలకు రూ. 35 వేల బ్యాంకు నుంచి రుణం మంజూరు చేయడంతోపాటు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ. 18,750 ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి కలిగిన రైతులకు ఆర్థికంగా మరింత చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 78 గ్రామ సచివాలయాల పరిధిలో 50 బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లను నిర్మించామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి అగ్రాసనం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా
- గ్రామాల్లో రూ.కోట్ల పనులకు శ్రీకారం



రాజానగరంలో మల్టీపర్పస్ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన అభివృద్ధి పనులను ప్రారంభించి, పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. భూపాలపట్నంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 54.90 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. రూ.15 లక్షలతో మురుగు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జల్‌జీవన మిషన్ పథకంలో ఓహెచ్‌ఆర్‌లు నిర్మించామని, వేసవి నాటికి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. అనంతరం రూ. 2.50 కోట్లతో లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో అంబేడ్కర్ పార్కు, తేజస్ స్కూల్ ఏరియా, స్పిన్నింగ్ మిల్లు, విజయ రెసిడెన్సీ ఏరియాల్లో సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం చుట్టారు. రాజానగరం, జి.యర్రంపాలెంలలో రూ. 1.15 కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్‌ను ప్రారంభించారు. సంపత్‌నగరం, జి.యర్రంపాలెంలలో జగనన్న పాలవెల్లువ పథకంలో ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాలను, భూపాలపట్నంలో బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. భూపాలపట్నంలో కైలాసగిరి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

మధురపూడి: నిడిగట్లలో వల్లభశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెట్ల సత్యనారాయణ, పల్లా కృష్ణ, వల్లభశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రేపు శివరాత్రి జాగరణ మహోత్సవం



శివరాత్రి జాగరణ జరిగే ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

రాజానగరం: శివరాత్రి అనగానే తమిళనాడులోని కొయంబత్తూరులో ఇషా ఫౌండేషన్ సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలో జరిగే జాగరణోత్సవం గుర్తుకొస్తుంది. ఇంచుమించు అదే తరహాలో రాజానగరంలో శివరాత్రి జాగరణ మహోత్సవాన్ని నిర్వహించాలని మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు మండవల్లి వెంకటేశ్వరరావు దంపతులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఇక్కడ విలేకరులకు వివరించారు. శని త్రయోదశితో కూడిన మహాశివరాత్రి 12 పుష్కరాలకు ఒకసారి వస్తుందని, ఈ సారి ఆ అవకాశం రావడంతో తాను ఈ కార్యక్రమానికి సంకల్పించానన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి మర్నాడు తెల్లవారుజాము వరకూ శివరాత్రి జాగరణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్‌కు సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిని అనుకుని ఉన్న సుమారు 30 ఎకరాల ఖాళీ స్థలంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలోని పురాతన ప్రసిద్ధి చెందిన రాజలింగేశ్వరస్వామి ఆలయం నుంచి శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పుంగనూరు గిత్తల బండిపై ఉంచి, 1,116 మందితో కూడిన కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుగా జాగరణోత్సవం జరిగే ప్రాంగణానికి తీసుకువస్తారన్నారు. అనంతరం కల్యాణోత్సవం, ఏకాదశ మహా రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, మంగళ హారతి జరుగుతాయి. కల్యాణోత్సవ సమయంలో 108 కిలోల ముత్యాల తలంబ్రాలు (బియ్యం) సమర్పిస్తారు. సుమారు 15 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో కళాకారులచే సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులచే అఖండ శంఖారావం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ఎంట్రీ ఫీజు రూ. 99 చెల్లించాలని, ఆ మొత్తానికి సమానమైన విలువ చేసే బహుమతిని ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. సమావేశంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా, కార్యదర్శి అనుకుమార్, సభ్యులు గ్రంధి రాజా, కంకటాల సత్యనారాయణ మూర్తి, యోగ రమణ, సత్తి బాబు, తదితరులు పాల్గొన్నారు.

జనపనార ఉత్పత్తులపై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

రాజానగరం: ప్రస్తుత కాలంలో జనపనార వస్తువులకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, వినియోగదారుల అవసరాలను గుర్తించి ఉత్పత్తులను తయారు చేస్తే ఆర్థికంగా ఎదగవచ్చని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. జనపనార ఉత్పత్తుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌పై గ్రామీణ మహిళలకు కేవీకేలో జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో వారం రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. రాజానగరం, రాజమహేంద్రవరం, నరేంద్రపురం, కలవచర్ల, కోరుకొండ, శ్రీకృష్ణపట్నం, గాదరాడలకు చెందిన 15 మంది మహిళలకు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. జనపనారతో టిఫిన్, లంచ్, సెల్‌ఫోన్ బ్యాగ్‌లు, ఆఫీసు ఫైల్స్ తదితర వస్తువుల తయారీతోపాటు స్క్రీన్ ప్రింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఆఖరి రోజు శిక్షణలో భాగంగా బొమ్మూరుకు చెందిన పి.అమరావతి పర్యవేక్షణలో చీరలపై స్క్రీన్ ప్రింటింగ్‌పై అవగాహన కలిగించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రతి మహిళ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలన్నారు. కేవీకే అధికారి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ధనదుర్గ అమ్మవారికి సారె సమర్పణ



ఊరేగింపుగా వస్తున్న భక్తులు

సీతానగరం: ధనదుర్గమ్మ జాతర సందర్భంగా బుధవారం 108 వంటకాలతో అమ్మవారికి సారె అందించారు. వెలమపేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవం నిర్వహించారు. వంటలను 250 బిందెలలో ఉంచి ఊరేగింపుగా మహిళలు పోలీస్ స్టేషన్ మీదుగా బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ నుంచి వెలమపేటలోని ఆలయానికి చేరారు. రాత్రి గరగ నృత్యాలు, తీన్‌మార్, డప్పుల వాయిద్యాలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో పాటు పల్లకి సేవలో అమ్మవారిని ఊరేగించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

సీతానగరం: ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అంబుడ్స్‌మెన్ ఎస్.ఖాదర్ బాషా సూచించారు. బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ పథక కార్యాలయాన్ని ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ గతంలో ఆడిట్‌లో వచ్చిన సమస్యలు తిరిగి పునరావృతం కారాదన్నారు. మస్తర్లలో కొట్టివేతలు ఉండరాదని, ఉపాధి హామీ పథకం కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో కూలీలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కృష్ణప్రసాద్‌ను కలసి ఎన్ఆర్ఈజీఎస్ పనులపై చర్చించారు. ఏపీఓ కె.నాగశేషవేణి, టీఏలు ఆర్పీ చక్రవర్తి, పీఓ మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణం



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వీర రాఘవులురెడ్డి, సత్యవతి దంపతులు

పెదపూడి: భక్తులందరూ భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్ల కల్యాణ ఉత్సవాలు నిర్వహించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, జి.మామిడాడ గ్రామంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ వంశపారపర్య ధర్మకర్త ద్వారంపూడి వీరరాఘవులురెడ్డి (పాపిరెడ్డి) అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా భీమేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి వీరరాఘవులురెడ్డి, సత్యవతి దంపతులు కల్యాణ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భారీ బాణసంచా కాల్చారు. శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని వీరరాఘవులురెడ్డి తెలిపారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి

మధురపూడి: మానవ అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ నిరోధించాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, కోరుకొండ తహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకావొద్దని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ (హైదరాబాద్), జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోరుకొండలో రెండు రోజుల శిక్షణ బుధవారం ప్రారంభమైంది. సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, సీడీపీఓ ఝాన్సీరాణి, ఎంపీడీఓ హేమసుందర్‌రావు, ఎంఈఓ సుజాత పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

జగనన్న పాలవెల్లువను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



అనపర్తిలో పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించి, పాడి రైతుకు రసీదును అందజేస్తున్న కృష్ణారెడ్డి

అనపర్తి: పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం-5 పరిధిలోని పాల సేకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని సర్పంచ్ వారా కుమారితో కలిసి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేటు డెయిరీల చేతిలో మోసపోకుండా, పాల ఉత్పత్తికి తగిన గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీనిద్వారా నిర్దిష్టమైన ధరను చెల్లించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడంతో పాల సేకరణ ధరలు పెరిగి పాడి రైతులకు అదనపు ప్రయోజనం చేకూరుతోందని వివరించారు. ఈ పాల సేకరణ కేంద్రాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంసూరి పద్మావతి, ఎంపీడీఓ వివి రవికుమార్, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ టి.రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు పుండరీవాసు, వాసంశెట్టి కోటేశ్వరరావు, మండ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.